# తెలంగాణ వెన్నెల వాక్కు
జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU
TGTEL/25/A0871



తెలంగాణ వెన్నెల వాక్కు **విలేకరులు కావలెను**

ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ శరవేగంగా రాజకీయ పరిస్థితులపై వాస్తవ కథనాలు అందిస్తూ అనతి కాలంలోనే ప్రజాదరణ పొందిన తెలంగాణ వెన్నెల వాక్కు లో రాష్ట్ర వ్యాప్తంగా స్టాఫర్లు, ఆర్సీ ఇంచార్జీలు, మండల రిపోర్టర్లు కావలెను. అనుభవజ్ఞులకు ప్రాధాన్యం.. కొత్త వారికి ప్రోత్సాహం



మీరు పని చేయాలనుకుంటున్న కేంద్రాల్లో ఖాళీల వివరాల కోసం 7386173123 నంబర్‌ను సంప్రదించండి..

డి. యోగేష్ కుమార్, సీఈవో



హైదరాబాద్ | సంపుటి : 01 | సంచిక :365 | 12-07- 2026 | ఆదివారం | పేజీలు: 4 | వెల రూ. 03


# పేరుకే 'బెస్ట్ అవైలబుల్ స్కూల్స్'..

## పేద విద్యార్థుల భవిష్యత్తుతో సర్కార్ ఆటలు!

నిర్మల్ జూలై 11 తెలంగాణ వెన్నెల వాక్కు

పేద, అణగారిన వర్గాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన, ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలనే సత్సంకల్పంతో ప్రభుత్వం 'బెస్ట్ అవైలబుల్ స్కూల్స్' (దీూూూ) పథకాన్ని తీసుకువచ్చింది. కానీ, ప్రస్తుతం ఈ పథకం అమలు తీరు చూస్తుంటే ప్రభుత్వానికి పేద పిల్లల చదువుపై ఎంతటి నిర్లక్ష్యం ఉందో స్పష్టమవుతోంది. "పేరుకే బెస్ట్ అవైలబుల్ స్కూల్స్.. కానీ క్షేత్రస్థాయిలో కనీస వసతులు లేవు" అంటూ విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజా సంఘాల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేవలం పథకం అమలు చేస్తున్నామనే ముసుగులో అధికారులు చేతులు దులుపుకుంటున్నారే తప్ప, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు గురించి ఆలోచించడం లేదనే సత్యం బహిర్గతమవుతోంది.

**రూ. 5 కోట్ల బకాయిలు.. కునారిల్లుతున్న విద్యా వ్యవస్థ**

విద్యా హక్కు చట్టం (=జు) నిబంధనల ప్రకారం ప్రతి పాఠశాలలోనూ పేద విద్యార్థుల కోసం 25 శాతం రిజర్వేషన్ కల్పించాల్సి ఉంటుంది. ఈ పథకం కింద ఎంపికైన విద్యార్థులకు అయ్యే ఫీజులు, పాఠ్యపుస్తకాలు, యూనిఫారమ్స్ ఖర్చులను ప్రభుత్వమే భరించాలి. అయితే, గత మూడు సంవత్సరాలుగా ప్రభుత్వం ఈ ఫీజుల చెల్లింపులో తీవ్ర జాప్యం చేస్తోంది. మూడేళ్లలో కేవలం 20 శాతం పెండింగ్ బిల్లులను మాత్రమే విడుదల చేసి, మిగతా భారాన్ని పాఠశాలలపైనే వదిలేసింది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా మొత్తం రూ. 5 కోట్లకు పైగా పెండింగ్ బిల్లులు పేరుకుపోవడంతో, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు చేతులెత్తేస్తున్నాయి.

నిధులు రాకపోవడంతో పాఠశాలల నిర్వహణ పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. ఫలితంగా, పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులకు ఇవ్వాల్సిన

**కార్పొరేట్ స్థాయి పాఠశాలల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు మెరుగైన విద్య అందించాలని, వసతులు లేని స్కూళ్లను మార్చాలని వెల్లువెత్తుతున్న డిమాండ్లు**




బుక్స్, యూనిఫారమ్స్ ఇవ్వడం నిలిపివేశాయి. బడులు తెరిచి రోజులు గడుస్తున్నా విద్యార్థులకు కనీస విద్యా సామాగ్రి అందకపోవడం వల్ల వారి చదువుపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఎంతో ఆశతో తమ పిల్లలను పెద్ద స్కూళ్లలో చదివించుకోవాలని కలలు గన్న తల్లిదండ్రులకు ఇప్పుడు తమ పిల్లల భవిష్యత్తు ఏమవుతుందోనన్న భయం పట్టుకుంది.

**కనీస వసతులు కరవు.. విద్యార్థుల జీవితాలతో ఆటలా?**

ప్రభుత్వం జిల్లా కేంద్రంలో కేటాయించిన పలు బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు కూడా లేకపోవడం గమనార్హం. తాగునీరు, నాణ్యమైన భోజనం, పరిశుభ్రమైన శౌచాలయాలు, నివాస యోగ్యమైన వసతి గృహాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రూ. 5 కోట్ల భారీ బకాయిల వల్ల స్కూళ్లు కనీస వసతులు కల్పించలేని స్థితికి చేరుకున్నాయి. "వసతులు లేని ఇటువంటి స్కూళ్లను మార్చాలి. అక్కడ పిల్లలను ఉంచడం వల్ల వారి చదువు నిర్వీర్యమవడమే కాకుండా, ఆరోగ్యం కూడా పాడవుతుంది. అధికారుల నిర్లక్ష్యం వల్ల పేద విద్యార్థుల జీవితాలు, వారి భవిష్యత్తు అంధకారంలోకి నెట్టబడుతున్నాయి" అని తల్లిదండ్రుల సమావేశంలో ప్రతినిధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారుతున్నా, విద్యా సంవత్సరాలు గడుస్తున్నా పేద విద్యార్థుల పట్ల వివక్ష చూపడం తగదని మండిపడుతున్నారు

**ఉన్నతాధికారులు తనిఖీలు చేయాలి.. కార్పొరేట్ పాఠశాలలు కేటాయించాలి!**

ఈ విద్యా సంక్షోభం నేపథ్యంలో ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రుల నుండి ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి పెరుగుతోంది. వెంటనే విద్యాశాఖ ఉన్నతాధికారులు రంగంలోకి దిగి, ప్రస్తుతం పథకం కింద ఉన్న పాఠశాలలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఆయా పాఠశాలల్లో నిజంగా విద్యా ప్రమాణాలు ఉన్నాయా? విద్యార్థులకు సరైన వసతులు అందుతున్నాయా? లేదా? అనే విషయాలను నిష్పాక్షికంగా పరిశీలించాలన్నారు.

పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్న చందంగా ఉన్న స్కూళ్లను పక్కనబెట్టి, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన విద్యార్థులకు విద్యా రంగంలో అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, వారికి నిజమైన మెరుగైన విద్యను అందించేందుకు పేరుపొందిన కార్పొరేట్ స్థాయి పాఠశాలలను కేటాయించాలని ప్రజలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు. వసతులు లేని స్కూళ్ల నుండి విద్యార్థులను తక్షణమే మార్చి, అన్ని రకాల మౌలిక సదుపాయాలు మరియు ఉత్తమ విద్యా ప్రమాణాలు కలిగిన ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించాలని కోరుతున్నారు.

ప్రభుత్వం ఇప్పటికైనా నిద్ర మత్తు వీడి, తక్షణమే రూ. 5 కోట్ల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, ఈ విద్యా సంవత్సరానికి ఇంకా అడ్మిషన్లు పొందని అర్హులైన విద్యార్థులందరికీ నాణ్యమైన కార్పొరేట్ పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించి పేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని ప్రజా సంఘాలు, తల్లిదండ్రులు హెచ్చరిస్తున్నారు.

## సినీ సంగీత ప్రపంచంలో తీరని లోటు: 'దక్షిణాది స్వరకోకిల' ఎస్. జానకి కన్నుమూత!



హైదరాబాద్ బ్యూరో

భారతీయ చలనచిత్ర రంగానికి చెందిన దిగ్గజ నేపథ్య గాయని, 'దక్షిణ భారత కోకిల'గా ప్రసిద్ధి చెందిన ఎస్. జానకి (88) శనివారం కన్నుమూశారు. కొంతకాలంగా వయోభారంతో కూడిన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె, మైసూర్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. ఆమె మరణవార్త వినగానే యావత్ సినీ ప్రపంచం తీవ్ర దిగ్భ్రాంతికి లోనైంది.

ఆరు దశాబ్దాల అద్భుత ప్రస్థానం:

ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా రేపల్లె సమీపంలో జన్మించిన జానకమ్మ, చిన్నతనం నుంచే సంగీతంపై ఉన్న మక్కువతో బాల్యంలోనే గాన ప్రస్థానాన్ని ప్రారంభించారు. దాదాపు ఆరు దశాబ్దాల పాటు సాగిన ఆమె సుదీర్ఘ సినీ ప్రయాణంలో తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీతో పాటు సుమారు 17కు పైగా భాషల్లో 48 వేలకు పైగా అద్భుతమైన పాటలను ఆలపించారు. గ్రామీణ జానపద గీతాల నుంచి మధురమైన ప్రేమ గీతాలు, భక్తి గీతాలు, శాస్త్రీయ సంగీతం వరకు ఆమె పాడిన ప్రతి పాట కోట్లాది మంది శ్రోతల మనసుల్లో చెరగని ముద్ర వేసింది.

అసాధారణ ప్రతిభ – పురస్కారాలు:

చిన్న పిల్లల గొంతు నుండి వృద్ధుల పాత్రల వరకు ఏ వయసు వారికైనా సరిపోయేలా తన స్వరంలో మార్పులు చేయడం ఆమెకున్న ప్రత్యేక శైలి. ముఖ్యంగా లెజెండరీ

2

## ఈటల రాజేందర్ వెనుక హరీశ్ రావు హస్తం..

### కాళేశ్వరం అసలు గుట్టు విప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి!

హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాజకీయాల్లో కాళేశ్వరం ప్రాజెక్టు చుట్టూ జరుగుతున్న వివాదం మరోసారి తీవ్ర రూపం దాల్చింది. భారతీయ జనతా పార్టీ పక్షాన ఎన్నికైన ప్రజాప్రతినిధి ఈటల రాజేందర్ కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుకూలంగా చేసిన వ్యాఖ్యల పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఈటల రాజేందర్ అంటే తమకు, సమాజానికి ఎంతో గౌరవం ఉందని, కానీ కాళేశ్వరం విషయంలో ఆయన అవగాహన లేకుండా అసత్యాలు మాట్లాడి ఆ గౌరవాన్ని కోల్పోతున్నారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ మొత్తం వ్యవహారం వెనుక ఉన్న అసలు కథను కుండబద్దలు కొట్టినట్లు వివరిస్తూ, దీని వెనుక భారత్ రాష్ట్ర సమితి నాయకుల వ్యూహం దాగి ఉందని రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు.



మాజీ మంత్రి హరీశ్ రావు ఇచ్చిన సూచనలతోనే, ఆయన రాసిచ్చిన పత్రాల ఆధారంగానే ఈటల రాజేందర్ కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుకూలంగా మాట్లాడారని రేవంత్ రెడ్డి విమర్శించారు. ఒక భారతీయ జనతా పార్టీ ప్రజాప్రతినిధిలా కాకుండా, భారత్ రాష్ట్ర సమితి నాయకుడిలా ఈటల మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. గత ప్రభుత్వ అక్రమాలను, ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతిని ఈటల రాజేందర్ వెనకేసుకురావడం వెనుక ఉన్న అసలు అంతరార్థం ఏంటని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. ప్రజాధనాన్ని నిలువునా ముంచిన ఒక విఫల ప్రాజెక్టును సమర్థించడం ద్వారా ఈటల రాజేందర్ ఎవరిని కాపాడాలని చూస్తున్నారని ఆయన నిలదీశారు. గతంలో కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ అవినీతి జరిగిందని మాట్లాడిన ఈటల, ఇప్పుడు మాట మార్చడం వెనుక ఉన్న రహస్యాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.

మేడిగడ్డ బ్యారేజ్ నిర్మాణంలో తీవ్రమైన లోపాలు ఉన్నాయని గత భారత్ రాష్ట్ర సమితి ప్రభుత్వ హయాంలోనే తేలిందని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. ప్రాజెక్టు ప్రారంభించిన కేవలం పదకొండు నెలల్లోనే అనేక సాంకేతిక లోపాలు బయటపడ్డాయని, ఆ సమయంలోనే వాటిని సవరించాలని క్షేత్రస్థాయి ఇంజినీర్లు మొత్తుకున్నా నాటి ప్రభుత్వ పెద్దలు పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించారని మండిపడ్డారు. కేవలం ప్రాథమిక నివేదికలోనే కాకుండా, అంతిమ నివేదికలోనూ జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (చీణ-ూూ) ఇదే విషయాన్ని స్పష్టం చేసిందని రేవంత్ రెడ్డి వివరించారు. పునాదుల నమూనాలో జరిగిన తప్పుల వల్లే మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోయిందని నిపుణుల కమిటీ తేల్చి చెప్పిన తర్వాత కూడా, దానిని ఒక అద్భుత కట్టడంగా అభివర్ణించడం ఈటల రాజేందర్ అజ్ఞానానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు.

లక్షల కోట్ల ప్రజాధనాన్ని కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో నాటి పాలకులు వృథా చేశారని, ఆ

2

## అంతర్జాతీయ విమానయాన రంగంలో హైదరాబాద్ మరో మైలురాయి..



హైదరాబాద్ బ్యూరో

అంతర్జాతీయ విమానయాన రంగంలో మరో అద్భుతమైన మైలురాయిని అధిగమించింది. ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన, అతిపెద్ద ప్రయాణీకుల విమానంగా గుర్తింపు పొందిన ఎమిరేట్స్ సంస్థకు చెందిన 'ూ-380' విమానాలు ఇకపై హైదరాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం

2

## మసల్గా తండాలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశానికి ఎమ్మెల్యే రాక

తానూర్ జులై 11 (తెలంగాణ వెన్నెల వాక్కు ):తానూర్ మండలంలోని మసల్గా తండాలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమానికి ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ నేడు మధ్యాహ్నం 12 గంటలకు హాజరుకానున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భారతీయ జనతా పార్టీ నాయకులు కోరార.




ఈ సందర్భంగా తానూర్ మండలంలోని అన్ని గ్రామాల నాయకులు, పార్టీ కార్యకర్తలు, సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తానూర్ మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు పూంద్ర లక్ష్మణ్ రెడ్డి కోరారు.

# విచ్చలవిడిగా నిషేధిత గడ్డిమందు అమ్మకాలు!

## అధికారుల కళ్లెదుటే దొడ్డి దారిన చీకటి దందా.. ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్న రైతాంగం

నిర్మల్ జూలై 11 తెలంగాణ వెన్నెల వాక్కు

జిల్లాలో వానాకాలం సీజన్ ఊపందుకోవడంతో పాటుగా సాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అయితే ఇదే తరుణంలో జిల్లా రైతాంగాన్ని అక్రమ వ్యాపారులు, నకిలీ ముఠాలు నిలువునా ముంచుతున్నాయి. ప్రజారోగ్యానికి, పర్యావరణానికి తీవ్ర ముప్పుగా మారిన హానికరమైన కలుపు నివారణ మందు 'పారాక్వాట్ డిక్లోరైడ్' అమ్మకాలపై తెలంగాణ ప్రభుత్వం ఇటీవల తాత్కాలిక నిషేధం విధించిన సంగతి తెలిసిందే. అయితే, నిర్మల్ జిల్లాలో ఈ ఉత్తర్వులు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి. జిల్లా కేంద్రంతో పాటు తానూర్, కుభీర్,భైంసా, ఖానాపూర్,పెంబి,కూంటల,లోకేశ్వరం,దస్తురాబాద్ ,ముధోల్, లక్ష్మణ్‌చాంద, కడెం వంటి పలు మండలాల్లోని ఫర్టిలైజర్ దుకాణాల్లో ఈ ప్రాణాంతక మందు విక్రయాలు రహస్యంగా, విచ్చలవిడిగా సాగుతూనే ఉన్నాయి. అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంతో అక్రమార్కులు మూడు పువ్వులు ఆరు కాయలుగా వ్యాపారం చేసుకుంటున్నారు.





**కూలీల కొరత -- పెరిగిన కెమికల్స్ వాడకం**

ప్రస్తుత రోజుల్లో వ్యవసాయ రంగంలో కూలీల కొరత ప్రధాన సమస్యగా మారింది. సకాలంలో కూలీలు దొరకకపోవడం, ఒకవేళ దొరికినా కూలి ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో రైతులు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. ముఖ్యంగా పత్తి, సోయాబీన్, మక్కజొన్న పంటల్లో కలుపు మొక్కల నివారణ అనేది రైతులకు పెద్ద తలనొప్పిగా మారింది. దీన్ని ఆసరాగా చేసుకుంటున్న కొందరు అక్రమ వ్యాపారులు, ఎరువుల దుకాణదారులు తక్కువ ఖర్చుతో ఎక్కువ విస్తీర్ణంలో కలుపు పోతుందంటూ రైతులకు ఈ పారాక్వాట్ రసాయనాన్ని అంటగడుతున్నారు. ఏ పంటకు ఏ మందు కొట్టాలనే కనీస అవగాహన లేని కొందరు రైతులు, దుకాణదారులు ఇచ్చిన మందులను తెచ్చి పొలాల్లో పిచికారీ చేస్తున్నారు. దీనివల్ల కలుపు మొక్కలతో పాటు పచ్చని పంటలు కూడా పూర్తిగా మాడిపోయి నష్టపోతున్న ఘటనలు జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్నాయి.

**సరిహద్దుల గుండా అక్రమ రవాణా**

నిర్మల్ జిల్లా పొరుగున ఉన్న మహారాష్ట్ర సరిహద్దులకు దగ్గరగా ఉండటం అక్రమ వ్యాపారులకు మరింత కలిసివస్తోంది. రాష్ట్రంలో ఈ మందుపై నిషేధం ఉన్నప్పటికీ, పక్క రాష్ట్రాల నుండి దొడ్డి దారిన, రాత్రి సమయాల్లో ఈ రసాయన నిల్వలను జిల్లాకు తరలిస్తున్నారు. రహస్య గోదాముల్లో, గ్రామాల్లోని ఇళ్లల్లో వీటిని దాచి ఉంచి, నమ్మకమైన రైతులకు మాత్రమే బ్లాక్ మార్కెట్లో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. పత్తి సాగు చేసే రైతులే లక్ష్యంగా ఈ దందా సాగుతోంది. ప్రభుత్వం నిషేధించిన బీజీ-3, బీటీ-3 వంటి నకిలీ పత్తి విత్తనాలతో పాటు, ఈ పారాక్వాట్ గడ్డిమందును కూడా ప్యాకేజీ రూపంలో రైతులకు అంటగడుతూ లక్షల రూపాయలు ఆర్జిస్తున్నారు.

**విరుగుడు లేని విషం!**

వైద్య ఆరోగ్య శాఖ మరియు వ్యవసాయ నిపుణుల నివేదికల ప్రకారం, ఈ పారాక్వాట్ డిక్లోరైడ్ అత్యంత ప్రమాదకరమైన రసాయనం. పొలాల్లో పిచికారీ చేసేటప్పుడు కనీస జాగ్రత్తలు తీసుకోకపోతే చర్మవ్యాధులు, శ్వాసకోశ సమస్యలు వస్తాయి. మరింత ఆందోళనకరమైన విషయం ఏమిటంటే, ఎవరైనా పొరపాటున లేదా క్షణికావేశంలో ఈ మందు తాగితే దానికి వైద్యశాస్త్రంలో ఎలాంటి

**విరుగుడు లేదు**

ఈ మందు తాగిన వారిని ఎంత వేగంగా ఆసుపత్రికి తరలించినా అంతర్గత అవయవాలు పూర్తిగా దెబ్బతిని ప్రాణాలు కోల్పోవాల్సిందే. జిల్లాలో గతంలో ఇలాంటి ఆత్మహత్యల ఘటనలు అనేకం చోటుచేసుకున్నాయి. ఈ తీవ్రతను గమనించే ప్రభుత్వం దీనిపై నిషేధం విధించినా, క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది.

**నిఘా కరువైంది.. చర్యలేవి?**

జిల్లాలో నకిలీ విత్తనాలు, నిషేధిత పురుగుల మందుల నియంత్రణకు గాను ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ బృందాల జాడ ఎక్కడా కనిపించడం లేదు. వ్యవసాయ శాఖ అధికారులు కేవలం ఒకటో రెండో దుకాణాలపై నామమాత్రపు దాడులు నిర్వహించి, చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు అధికారులు ఎరువుల వ్యాపారులతో కుమ్మక్కై మామూళ్ల మత్తులో మునిగిపోవడం వల్లే ఈ అక్రమ విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయని రైతాంగం బహిరంగంగానే ఆరోపిస్తోంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి, టాస్క్‌ఫోర్స్ బృందాలను రంగంలోకి దించాలని, అక్రమ నిల్వలను సీజ్ చేసి బాధ్యులైన డీలర్ల లైసెన్సులను రద్దు చేయడంతో పాటు వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జిల్లా రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# 'దక్షిణాది స్వరకోకిల' ఎస్. జానకి కన్నుమూత!

గాయకుడు ఎస్. పి. బాలసుబ్రహ్మణ్యంతో కలిసి ఆమె పాడిన యుగళ గీతాలు సంగీత చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిపోయాయి. ఆమె అసాధారణ ప్రతిభకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం నుండి 4 జాతీయ చలనచిత్ర పురస్కారాలు లభించాయి. అలాగే వివిధ దక్షిణాది రాష్ట్ర ప్రభుత్వాల నుండి 30కి పైగా చలనచిత్ర పురస్కారాలు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి 12 నంది పురస్కారాలను అందుకున్నారు.

సంగీత లోకం నివాళులు:

ఎస్. జానకి మరణంతో భారతీయ సినీ సంగీత ప్రపంచంలో ఒక మహోన్నతమైన సువర్ణ యుగం ముగిసినట్లయింది. ఆమె భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆమె పాడిన వేలాది మధుర గీతాల రూపంలో ఆమె ఎల్లప్పుడూ సంగీత ప్రియుల హృదయాల్లో జీవించే ఉంటారు. జానకమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ పలువురు సినీ నటీనటులు, గాయకులు, రాజకీయ ప్రముఖులు మరియు అభిమానులు ఆమెకు ఘన నివాళులు అర్పిస్తున్నారు.

# ఈటల రాజేందర్ వెనుక హరీశ్ రావు హస్తం..

నష్టాన్ని పూడ్చడానికి ప్రస్తుత ప్రభుత్వం ఎంతో శ్రమిస్తోందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఒకవైపు కాళేశ్వరం వైఫల్యాలపై విచారణ జరుగుతుంటే, నిందితులను రక్షించేలా ప్రతిపక్ష నాయకులు ప్రగల్భాలు పలకడం సరికాదన్నారు. హరీశ్ రావు, కేటీఆర్ వంటి నాయకులు తెరవెనుక ఉండి నడిపిస్తున్న రాజకీయ నాటకంలో ఈటల రాజేందర్ ఒక పాత్రధారిగా మారడం విచారకరమన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల తెలంగాణ రైతులకు జరిగిన మేలు కంటే నాటి పాలకుల ఖజానా నిండిందే ఎక్కువని, ఈ సత్యాన్ని ఎంత దాచాలని చూసినా దాగదని ముఖ్యమంత్రి కుండబద్దలు కొట్టారు.

తెలంగాణ ప్రజల సొమ్మును దోచుకున్న ప్రతి ఒక్కరినీ చట్టం ముందు నిలబెడతామని, ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. రాజకీయ ప్రయోజనాల కోసం నిజాలను సమాధి చేయాలని చూస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఈటల రాజేందర్ ఇప్పటికైనా వాస్తవాలను గ్రహించి, హరీశ్ రావు తప్పుడు ప్రచారాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యాలపై పూర్తి స్థాయి నివేదిక త్వరలోనే ప్రజల ముందుకు వస్తుందని, అప్పుడు తప్పు చేసిన వారు ఎవరైనా సరే శిక్ష అనుభవించక తప్పదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# అంతర్జాతీయ విమానయాన రంగంలో హైదరాబాద్ మరో మైలురాయి..

(శంషాబాద్) నుంచి తమ సేవలను ప్రారంభించనున్నాయి. ఈ విమానాలు హైదరాబాద్ నగరానికి రావడం విమానయాన చరిత్రలోనే అత్యంత కీలకమైన పరిణామంగా నిలవనుంది. ఈ మహత్తర ప్రతిపాదనకు సంబంధించి ఎమిరేట్స్ విమానయాన సంస్థ వైస్ ప్రెసిడెంట్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సచివాలయంలో సమావేశమై అత్యంత కీలకమైన చర్చలు జరిపారు. ఈ చర్చల అనంతరం హైదరాబాద్ అంతర్జాతీయ ప్రయాణీకులకు మరిన్ని మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయని స్పష్టమైంది.

హైదరాబాద్‌కు ఎమిరేట్స్ 'ఎ-380' విమానాలను నడిపేందుకు ఉన్న అవకాశాలు, విమానాశ్రయంలో అందుబాటులో ఉన్న మౌలిక వసతులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సంస్థ ప్రతినిధుల బృందం సుదీర్ఘంగా చర్చించింది. శంషాబాద్ విమానాశ్రయం అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించబడటం, గడిచిన కొద్ది కాలంగా ఇక్కడి నుంచి ప్రయాణించే అంతర్జాతీయ ప్రయాణీకుల రద్దీ రోజురోజుకూ విపరీతంగా పెరుగుతుండటంతో ఈ భారీ జంబో విమానాన్ని ఇక్కడి నుంచి నడపడం ఇరుపక్షాలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని సంస్థ భావించింది. ఈ ప్రతిపాదనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతో సానుకూలంగా స్పందించారు. తెలంగాణ ప్రభుత్వం తరపున విమానయాన రంగానికి, అంతర్జాతీయ పారిశ్రామిక సంస్థలకు పూర్తి స్థాయిలో సహకారం అందిస్తామని, విమానాశ్రయ విస్తరణకు మరియు మౌలిక వసతుల కల్పనకు అవసరమైన అన్ని రకాల అనుమతులను వేగంగా మంజూరు చేస్తామని ముఖ్యమంత్రి ఎమిరేట్స్ ప్రతినిధులకు హామీ ఇచ్చారు. ప్రపంచంలోనే అతిపెద్ద డబుల్ డెక్కర్ (రెండు అంతస్తుల) ప్రయాణీకుల విమానమైన 'ఎ-380'ని నడపడం ద్వారా హైదరాబాద్ విమానాశ్రయం స్థాయి అంతర్జాతీయ విమానయాన పటంలో మరింత పెరగనుంది. ఇప్పటివరకు భారతదేశంలోని కేవలం కొన్ని ఎంపిక చేసిన నగరాలకే పరిమితమైన ఈ విమాన సేవలు, ఇప్పుడు హైదరాబాద్‌కు కూడా రావడం వల్ల గల్ఫ్ దేశాలతో పాటు యూరప్, అమెరికా వెళ్లే అంతర్జాతీయ ప్రయాణీకులకు ప్రయాణం మరింత సులభతరం కానుంది. ఈ భారీ విమానం ద్వారా ఒకేసారి ఎక్కువ మంది ప్రయాణీకులు ప్రయాణించే అవకాశం కలగడం వల్ల ప్రయాణ ఖర్చులు తగ్గడమే కాకుండా, ప్రయాణ సమయం కూడా కలిసివస్తుంది. ఈ అరుదైన నిర్ణయంతో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం అంతర్జాతీయ విమానయాన కేంద్రంగా మరింత బలోపేతం కానుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

తెలంగాణ రాష్ట్రంలో పారిశ్రామిక రంగాన్ని, ఐటీ రంగాన్ని మరియు పర్యాటక రంగాన్ని ప్రపంచవ్యాప్తంగా విస్తరించాలనే లక్ష్యంతో ప్రస్తుత ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగానే అంతర్జాతీయ అనుసంధానతను పెంచడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. హైదరాబాద్ నుంచి దుబాయ్ వంటి అంతర్జాతీయ నగరాలకు నిరంతరం ప్రయాణించే వ్యాపారవేత్తలు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు మరియు ప్రవాస భారతీయులకు ఈ సరికొత్త సేవలు ఎంతో మేలు చేకూరుస్తాయి. ఎమిరేట్స్ సంస్థ ప్రతినిధులు సైతం

# ధరణి కోరల్లో భూ రికార్డులు..!


## డిజిటల్ ఆధునీకరణ పేరిట జరిగిన వ్యవస్థీకృత దోపిడీపై కఠిన చర్యలు అవసరం

తెలంగాణలో భూ పరిపాలనను సంస్కరించడానికి, పారదర్శకతను పెంచడానికి, లంచగొండితనానికి చరమగీతం పాడటానికి గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన 'ధరణి' వెబ్ పోర్టల్, ఆశించిన లక్ష్యాలకు పూర్తిగా భిన్నమైన ఫలితాలను ఇచ్చిందనేది ఇప్పుడు జగమెరిగిన సత్యం. భూమి అనే పవిత్రమైన అర్థం వచ్చేలా నామకరణం చేసిన ఈ డిజిటల్ వ్యవస్థ, కాలక్రమేణా అమాయక రైతుల పాలిట శాపంగా, అక్రమార్కులకు కామధేనువుగా మారిపోవడం అత్యంత విచారకరం, వ్యంగ్యం. 2023 చివరి నాటి ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం, ఈ వ్యవస్థలోని లోపాలను గుర్తించి 'భూ భారతి' అనే సరికొత్త పద్ధతిని తీసుకువచ్చినప్పటికీ, ధరణి పోర్టల్ నీడన జరిగిన అవినీతి తీవ్రతను వెలికితీస్తున్న కొద్దీ దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి.

ఇటీవల అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారుల చేతికి చిక్కిన సర్వే, సెటిల్మెంట్ మరియు భూ రికార్డుల విభాగం ఇన్‌ఛార్జ్ డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరి రావు కేసే ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ. ఒక ప్రభుత్వ ఉన్నతాధికారి వద్ద ప్రస్తుత మార్కెట్ విలువల ప్రకారం దాదాపు వంద నుండి రెండు వందల కోట్ల రూపాయల మేర అక్రమ ఆస్తులు బయటపడటం సామాన్యమైన విషయం కాదు. అంతకంటే ఘోరమైన విషయం ఏమిటంటే, అసలైన భూ యజమానులకు కనీస సమాచారం కూడా లేకుండా, వారి సంతకాలు, అనుమతులు లేకుండానే ఒక తాహసిల్దార్ ఏకంగా 400 ఎకరాల యాజమాన్య హక్కులను ఇతరుల పేరిట రాత్రికి రాత్రే బదిలీ చేసేశారు. అయితే, ధరణి ద్వారా జరిగిన ఈ బృహత్తర అవినీతి సామ్రాజ్యంలో ఇవి కేవలం పైకి కనిపిస్తున్న గోరంత విషయాలు మాత్రమేనని క్షేత్రస్థాయి పరిశీలనలు చెబుతున్నాయి.

ఈ డిజిటల్ మాయాజాలం వెనుక ఉన్న అసలు రహస్యాలను ఛేదించేందుకు కేరళ సెక్యూరిటీ ఆడిట్ అండ్ అస్యూరెన్స్ సెంటర్ నిర్వహించిన ఒక సమగ్ర ఫోరెన్సిక్ ఆడిట్ నివేదిక కళ్ళు బైర్లు గమ్మే నిజాలను బహిర్గతం చేసింది. కేవలం సాంకేతిక లోపాలే కాకుండా, దాదాపు 10,000 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో 22,000 కు పైగా మోసపూరిత లావాదేవీలు జరిగినట్లు ఈ ఆడిట్‌లో పక్కా ఆధారాలతో నిరూపితమైంది. ఈ నివేదిక ఆధారంగా ప్రభుత్వం రంగంలోకి దిగి ఇప్పటికే 20 మందికి పైగా దళారులను, తక్కువ స్థాయి సిబ్బందిని అదుపులోకి తీసుకుని విచారిస్తోంది. కానీ, ఇక్కడే మనం ఒక ప్రాథమిక సూత్రాన్ని గమనించాలి. ఇంతటి భారీ స్థాయి భూ కుంభకోణాన్ని కేవలం కింది స్థాయి సిబ్బంది లేదా ప్రైవేట్ దళారులు మాత్రమే నడిపించలేరు. ఉన్నతాధికారుల, లోపాయికారీ శక్తుల పరోక్ష లేదా ప్రత్యక్ష ఆశీస్సులు, సహకారం లేకుండా ఈ స్థాయి వ్యవస్థీకృత నేరం జరగడం అసాధ్యం. కాబట్టి, విచారణ కేవలం కింది స్థాయి ఉద్యోగులకే పరిమితం కాకుండా, తెరవెనుక ఉన్న పెద్ద తిమింగలాల వైపు సాగాలి.

ప్రస్తుతం అమలులోకి వస్తున్న 'భూ భారతి' విధానం కూడా పాత ధరణి పోర్టల్ యొక్క సాంకేతిక నిర్మాణంపైనే ఆధారపడి పనిచేస్తోందనేది నిపుణుల వాదన. అయితే ప్రస్తుత ప్రభుత్వం క్షేత్రస్థాయిలో భూములను సరిగ్గా కొలవడానికి, సరిహద్దులను గుర్తించడానికి సరికొత్తగా సర్వేయర్లను రంగంలోకి దించింది. నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) ఆధ్వర్యంలో సరికొత్తగా రూపుదిద్దుకుంటున్న వెబ్ పోర్టల్‌తో పాటుగా, సమాంతరంగా పాత పద్ధతి అయిన మాన్యువల్ (చేతిరాత) భూ రికార్డులను కూడా భద్రపరచాలని ప్రభుత్వం యోచిస్తోంది. డిజిటల్ రికార్డులు మాయమైనా లేదా మార్చబడినా, భౌతిక రికార్డులు రక్షణగా ఉంటాయనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు, ధరణి కాలంలో జరిగిన అక్రమాలపై సమగ్ర ఆధారాలను సేకరించేందుకు ప్రభుత్వం నియమించిన తొమ్మిది మంది సభ్యుల ఉన్నత స్థాయి కమిటీ తన విచారణను దాదాపు పూర్తి చేసింది. రాబోయే కొద్ది రోజుల్లోనే ఈ కమిటీ ప్రభుత్వానికి తుది నివేదికను సమర్పించే అవకాశం ఉంది. ఆ నివేదిక ఆధారంగానైనా తదుపరి చర్యలు కఠినంగా ఉంటాయని ఆశిద్దాం.




భూ సమస్యలు అనేవి అత్యంత సంక్లిష్టమైనవి, సాధారణ సివిల్ వివాదాలతో ముడిపడి ఉన్నవి. అందుకే ఈ కుంభకోణంపై జరుగుతున్న దర్యాప్తునకు ఇప్పటికే రెండేళ్లకు పైగా సమయం పట్టింది. కానీ విచారణ పేరిట ఎంత కాలం కాలయాపన చేసినా అది అక్రమార్కులకే లాభిస్తుంది. కాబట్టి, ప్రభుత్వం తక్షణమే స్పందించి ఈ కేసుల విచారణను వేగవంతం చేయాలి. ఇందులో పీఠాలపై కూర్చుని చక్రం తిప్పిన ప్రతి ఒక్కరినీ చట్టం ముందు నిలబెట్టాలి. ఈ కేసులను వేగంగా పరిష్కరించడానికి ఒక ప్రత్యేక విచారణ బృందాన్ని నియమించడంతో పాటు, ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయడం ద్వారా బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలి. అలాగే, అవినీతి ఆరోపణలపై సస్పెండ్ అయిన అధికారులు చట్టంలోని లూప్‌హోల్స్‌ను వాడుకుని మళ్లీ కొన్ని రోజులకే అదే కీలకమైన స్థానాల్లోకి తిరిగి వచ్చే పాత పద్ధతికి పూర్తిగా చెక్ పెట్టాలి.

ధరణి వల్ల జరిగిన నష్టం కేవలం ఆర్థికపరమైనది మాత్రమే కాదు, అది సామాన్యుడి ప్రాణాలతో ముడిపడి ఉన్న మానవీయ సంక్షోభం. తమ తాత ముత్తాతల కాలం నుండి సాగు చేసుకుంటున్న భూమి రికార్డుల నుండి మాయమైపోవడంతో, గుండె పగిలి చనిపోయిన రైతులు ఎందరో ఉన్నారు. తమ భూమిని తమదే అని నిరూపించుకోవడానికి దరఖాస్తులు పట్టుకుని నేటికీ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ, కలెక్టరేట్ల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్న అమాయక రైతుల ఆర్తనాదాలు వినేవారే కరువయ్యారు. ఆధునీకరణ, డిజిటలైజేషన్ అనేది పరిపాలనా సౌలభ్యం కోసం ఉండాలి కానీ, అమాయక ప్రజలను వేధించడానికి, వారి ఆస్తులను లాక్కోవడానికి కాదు. ఇప్పటికైనా పాలకులు కళ్లు తెరిచి, ఎటువంటి లొసుగులు లేని, పారదర్శకమైన, ఎవరినీ ఇబ్బంది పెట్టని ఒక పటిష్టమైన భూ రికార్డుల వ్యవస్థను ఎటువంటి ఆలస్యం లేకుండా యుద్ధప్రాతిపదికన నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ
9848559863

# ఎస్ఐఆర్ ఓటర్ నమోదు అవగాహన సదస్సు



.నిర్మల్, జూలై 11 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ పట్టణంలోని శిక్షపెట్ ఏడో వార్డు పరిధిలో శనివారం కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై స్థానిక ప్రజలకు విస్తృత అవగాహన కల్పించే ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ షాకీర్, తెలంగాణ ఏక్తా ముస్లిం ఏక్తా సంఘం అధ్యక్షుడు షేక్ ముజాహిద్, మున్నా, రిజ్వాన్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ ఓటర్ల చైతన్య సదస్సులో ప్రజలకు ఓటర్ నమోదు ప్రక్రియ, ఫారాల భర్తీపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమన్ అలీ మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి ప్రాణప్రథమమని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ ఎస్ఐఆర్ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఓటర్ల నమోదు, మార్పుల విషయంలో ఏవైనా సందేహాలు ఉంటే బూత్ లెవెల్ అధికారులను (బీఎల్ఓ) సంప్రదించి నివృత్తి చేసుకోవాలన్నారు.

# మరిచిపోయిన పర్సును అప్పగించి నిజాయితీ చాటిన సిబ్బంది



బాసర, జూలై 11 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ జిల్లా బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో విధుల్లో ఉన్న దేవస్థాన సిబ్బంది, హోంగార్డులు తమ పారదర్శక నిజాయితీని చాటుకుని భక్తుల ప్రశంసలు అందుకున్నారు. ఆలయ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, శనివారం ఉదయం బాసర క్షేత్రానికి అమ్మవారి దర్శనార్థం వచ్చిన ఒక మహిళా భక్తురాలు ఆలయ ప్రదక్షిణల ప్రాంగణంలో ప్రమాద వశాత్తు తన చేతి పర్సును మరిచిపోయి వెళ్ళింది. అక్కడే విధుల్లో ఉన్న ఆలయ సిబ్బంది బలగం రాజు చంద్రమోహన్, హోంగార్డులు ఆ పర్సును గమనించి భద్రపరిచారు. అనంతరం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌కు చెందిన అంజలి జైన్ అనే మహిళా భక్తురాలు కంగారుగా ఆలయ కార్యాలయానికి వచ్చి తన పర్సు పోయినట్లు ఫిర్యాదు చేసింది. అధికారులు పర్సును పరిశీలించగా అందులో 4,000 రూపాయల నగదు, వన్‌గ్రామ్ బంగారు ఆభరణం, ముఖ్యమైన ఆధార్, గుర్తింపు పత్రాలు భద్రంగా ఉన్నాయి. ఆలయ సిబ్బంది అందరి సమక్షంలో సదరు పర్సును భక్తురాలికి సురక్షితంగా అప్పగించారు. పర్సును అందుకున్న భక్తురాలు ఆలయ సిబ్బంది నిజాయితీని కొనియాడుతూ కృతజ్ఞతలు తెలిపారు.

# సర్పంచ్ నక్క మల్లేష్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే





ముధోల్, జూలై 11 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ముధోల్ మండలంలోని రువ్వి గ్రామానికి చెందిన స్థానిక సర్పంచ్ నక్క మల్లేష్ ఇటీవల అనారోగ్య కారణాలతో అకాల మరణం చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం రువ్వి గ్రామంలోని మృతుడి నివాసానికి ముధోల్ మాజీ శాసనసభ్యుడు నారాయణ రావు పటేల్ విచ్చేసి, నక్క మల్లేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా అంజలి ఘటించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారిని ఓదార్చుతూ ప్రగాఢ సంవేదన వ్యక్తం చేశారు. కష్టకాలంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, తాము ఆ కుటుంబానికి రాజకీయంగా, సామాజికంగా అన్ని విధాలా అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. నక్క మల్లేష్ మరణం రువ్వి గ్రామాభివృద్ధికి తీరని లోటన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రావుల గంగారెడ్డి, అష్ట గ్రామ సర్పంచ్ రావుల లావణ్య శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శంకర్ చంద్రే, తానూర్ మాజీ ఎంపీపీ చంద్రకాంత్, మాజీ ఎంపీటీసీ సాయి రెడ్డి, లక్ష్మీ నారాయణ, ప్రేమ్ నాథ్ రెడ్డి, సర్దార్ వినోద్, భోజందర్ రెడ్డి పాల్గొన్నారు.

# నాణ్యమైన దర్యాప్తు, పోలీసు సమాచార వ్యవస్థ బలోపేతంపై ప్రత్యేక దృష్టి: డీఐజీ ఆర్. భాస్కరన్




నిర్మల్, జూలై 10 (తెలంగాణ వెన్నెల వాక్కు):
బాసర జోన్-2 నూతన డీఐజీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఐపీఎస్ అధికారి ఆర్. భాస్కరన్ శనివారం తొలిసారిగా నిర్మల్ జిల్లా కేంద్రంలో పర్యటించారు. ఈ సందర్భంగా నిర్మల్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లా పోలీసు ఉన్నతాధికారులతో ఆయన తొలి పరిచయ, సమగ్ర నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాలయానికి చేరుకున్న డీఐజీ భాస్కరన్ కు నిర్మల్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల పూలమొక్కను అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం సాయుధ పోలీసు సిబ్బంది నుండి డీఐజీ అధికారిక గౌరవ వందనం (గార్డ్ ఆఫ్ ఆనర్) స్వీకరించారు.

నేరాల అదుపునకు శాస్త్రీయ దర్యాప్తు అవసరం:
సమావేశంలో జిల్లా శాంతిభద్రతలు, నేర నియంత్రణ, దీర్ఘకాలిక పెండింగ్ కేసుల దర్యాప్తు, మహిళలు, చిన్నారుల రక్షణ, సైబర్ నేరాల నివారణ, పట్టణ ట్రాఫిక్ నిర్వహణ, మాదకద్రవ్యాల (గంజాయి) పూర్తి నిర్మూలన, కమ్యూనిటీ పోలీసింగ్ తదితర అంశాలపై డీఐజీ క్షుణ్ణంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలీసు సమాచార వ్యవస్థను మరింత బలోపేతం చేసి క్షేత్రస్థాయిలో నాణ్యమైన సమాచార సేకరణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రతి కేసులో సాంకేతిక ఆధారాలతో కూడిన శాస్త్రీయ దర్యాప్తు, కేస్ అనాలిసిస్ ద్వారా వేగవంతమైన విచారణ చేపట్టి బాధితులకు సత్వర న్యాయం అందించాలన్నారు. అనంతరం ఎస్పీ జానకి షర్మిల పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలో ప్రవేశపెట్టిన పోలీస్ అక్క, నారీ శక్తి, శివంగి టీమ్, గంజా గస్తీ వంటి వినూత్న కార్యక్రమాల పురోగతిని వివరించారు. 'పోలీస్ అక్క' కార్యక్రమానికి జాతీయ స్థాయి ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డు లభించడం పట్ల డీఐజీ పోలీసు శాఖను ప్రశంసించారు. సమావేశంలో భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు, ఆర్ఐలు పాల్గొన్నారు.

# అష్ట గ్రామంలో యుద్ధప్రాతిపదికన నూతన వీధి దీపాల ఏర్పాటు



ముధోల్, జూలై 11 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ముధోల్ మండల పరిధిలోని అష్ట గ్రామంలోని వివిధ వార్డులలో ప్రజల సౌకర్యార్థం, చీకటి సమస్యల నివారణకు అష్ట గ్రామ సర్పంచ్ రావుల లావణ్య శ్రీనివాస్ ఆధ్వర్యంలో నూతన వీధి దీపాలను (ఎల్ఈడీ బల్బులు) విజయవంతంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామస్తులకు రాత్రి వేళల్లో రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వార్డుల వారీగా యుద్ధ ప్రాతిపదికన చెడిపోయిన వీధి దీపాల స్థానంలో కొత్త వాటిని అమర్చడం జరుగుతున్నదని తెలిపారు. ప్రస్తుతం వర్షాకాలం సీజన్ ప్రారంభమైనందున పాములు, తేళ్ల భయం లేకుండా, వీధుల్లో వెలుతురు ఉండేలా గ్రామపంచాయతీ తరపున అన్ని రకాల ముందస్తు రక్షణ చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. గ్రామ పరిసరాల పారిశుద్ధ్య అభివృద్ధికి ప్రజలు సైతం తమవంతుగా గ్రామపంచాయతీ పాలకవర్గానికి, సిబ్బందికి పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# చిట్టాపూర్ లో ఓటరు సవరణ ప్రక్రియను పరిశీలించిన బీజేపీ నాయకుడు అశోక్ గౌడ్



ఆర్మూర్, జూలై 11 (తెలంగాణ వెన్నెల వాక్కు):
కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా సాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని బూత్ లెవెల్ అధికారులు (బీఎల్ఓ) అత్యంత సమర్థవంతంగా నిర్వహించాలని, ఓటర్లకు దీనిపై సరైన అవగాహన కల్పించాలని బీజేపీ సీనియర్ నాయకుడు అబ్బగోని అశోక్ గౌడ్ సూచించారు. శనివారం ఆయన తన సొంత గ్రామమైన ఆర్మూర్ మండల పరిధిలోని చిట్టాపూర్ లో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఓటర్ల ప్రత్యేక సవరణ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వార్డు పరిధిలోని బూత్ కేంద్రానికి వెళ్లి తన ఓటరు వివరాలను ప్రభుత్వ అధికారులకు, బీఎల్ఓలకు అందజేసి సరిచూసుకున్నారు. గ్రామంలోని అర్హులైన యువతీ యువకులు, ఓటర్లు అందరూ బాధ్యతగా ఈ సవరణ ప్రక్రియలో పాల్గొని, మార్పులు చేర్పుల కొరకై తమ వివరాలను బీఎల్ఓలకు గడువులోగా అందజేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు కళ్లెం సుధాకర్ సాయం నవీన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యానగర్ కమ్యూనిటీ హాల్ లో ఓటర్ల ఎస్ఐఆర్ ఫారాల నమోదు కేంద్రం ఏర్పాటు



ఆర్మూర్, జూలై 11 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ఆర్మూర్ పట్టణ పరిధిలోని విద్యానగర్ కాలనీవాసుల సౌకర్యార్థం స్థానిక విద్యానగర్ కమ్యూనిటీ హాల్ లో శనివారం ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం వార్డుల పరిధిలోని అర్హులైన ఓటర్ల వివరాల నమోదు, మార్పుల కొరకై బూత్ లెవెల్ అధికారులు (బీఎల్ఓ) ఈ కేంద్రంలో అందుబాటులో ఉంటారు. కాలనీలోని ఓటర్లు అందరూ ఇప్పటికే తమ ఇళ్ల వద్దకు బీఎల్ఓలు తెచ్చి ఇచ్చిన ఎస్ఐఆర్ ఫారాలను పూర్తిగా పూరించి, వాటితో పాటు ఒక పాస్‌పోర్ట్ సైజు ఫొటో, ఆధార్ కార్డు జిరాక్స్ పత్రాలను తప్పనిసరిగా జతచేసి ఈ కేంద్రంలో సమర్పించాలని అధికారులు సూచించారు. ఫారాలు నింపడం రాని వారు నేరుగా కమ్యూనిటీ హాల్ కు విచ్చేస్తే బీఎల్ఓలు దగ్గరుండి ఫారాలను పూర్తి చేస్తారని, ఈ అవకాశాన్ని కాలనీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# వాన కోసం రైతుల కళ్లల్లో ఎదురుచూపులు.. స్ప్రింక్లర్లతో పంటలను కాపాడుతున్న అన్నదాతలు

- ఖరీఫ్ సీజన్ లో ఆశించిన స్థాయిలో కురవని వర్షాలు.. ముధోల్ నియోజకవర్గంలో రైతుల ఆందోళన
- సోయాబీన్ పంటలు మొలకెత్తక రెండోసారి విత్తనాలు.. పెరిగిన అదనపు పెట్టుబడి ఖర్చులు



ముధోల్, జూలై 11 (తెలంగాణ వెన్నెల వాక్కు - ప్రత్యేక వార్తా కథనం):
ప్రస్తుత ఖరీఫ్ (వానాకాలం) సీజన్ ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా జిల్లాలో ఆశించిన స్థాయిలో పకడ్బందీగా వర్షాలు కురవకపోవడంతో ముధోల్ నియోజకవర్గ రైతాంగం తీవ్ర ఆందోళన చెందుతోంది. నియోజకవర్గ పరిధిలోని భైంసా, కుంటాల, లోకేశ్వరం, కుబీర్, తానూర్ మండలాల్లో వర్షాభావ పరిస్థితులు అన్నదాతలను నిద్రలేకుండా చేస్తున్నాయి. జూన్ నెల చివరి వారంలో కురిసిన అరకొర వర్షాలను ఆసరాగా చేసుకుని రైతులు ఎంతో ఆశతో పత్తి, సోయాబీన్, మొక్కజొన్న పంటలను విస్తృతంగా విత్తారు. అయితే విత్తనాలు వేసినప్పటి నుండి ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో పెద్ద వర్షాలు పడకపోవడంతో క్షేత్రస్థాయిలో భూమి ఎండిపోయి మొలకలు మాడిపోయే పరిస్థితి ఏర్పడింది.

పెరిగిన ఆర్థిక భారం.. ఆదుకోవాలని విజ్ఞప్తి:
ప్రస్తుతం ఎండ తీవ్రత పెరగడంతో పత్తి, సోయాబీన్ పంటలు ఎండిపోకుండా కాపాడుకునేందుకు అన్నదాతలు బోర్ బావులు, వ్యవసాయ బావుల ద్వారా స్ప్రింక్లర్లతో (చిలకరింపు పద్ధతి) నీరు అందిస్తూ పంటలను బతికించుకునేందుకు తాపత్రయపడుతున్నారు. దీనివల్ల డీజిల్, విద్యుత్ మోటార్ల మరమ్మతులు, అదనపు కూలీల ఖర్చులు పెరిగి రైతులపై మోయలేని ఆర్థిక భారం పడుతోంది. కొన్ని లోతట్టు ప్రాంతాల్లో విత్తిన సోయాబీన్ విత్తనాలు తేమ లేక భూమిలోనే కుళ్ళిపోయి సరిగా మొలకెత్తకపోవడంతో, రైతులు అప్పులు తెచ్చి రెండోసారి విత్తనాలు వేయాల్సిన దుస్థితి ఏర్పడింది. మరో వారం రోజుల్లోగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురవకపోతే ఖరీఫ్ పంటలకు తీవ్ర నష్టం వాటిల్లి పెట్టుబడులు కూడా దక్కవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి ప్రత్యామ్నాయ నీటి వనరుల విడుదలపై శ్రద్ధ పెట్టాలని కోరుతున్నారు.

# సమాజంలో మార్పు కోసమే జర్నలిస్టులు సమస్యలను వెలికితీయాలి

## జూనీయర్ సివిల్ జడ్జి సరళరాణి

- ఆర్మూర్ ప్రెస్ క్లబ్ లో అయ్యప్ప ఫౌండేషన్ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు ప్రమాద భీమా పత్రాల పంపిణీ
- వృత్తితో పాటు ప్రాణరక్షణ ముఖ్యం.. బైక్ నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరి




ఆర్మూర్, జూలై 11 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ప్రజలకు మేలు చేసే నిగూఢ సమస్యలను జర్నలిస్టులు ధైర్యంగా వెలికితీసి, సమాజంలో విప్లవాత్మక మార్పు కోసం నిరంతరం ప్రయత్నించాలని ఆర్మూర్ జూనీయర్ సివిల్ జడ్జి సరళరాణి పిలుపునిచ్చారు. ఆర్మూర్ పట్టణ కేంద్రంలోని నవనాథపురం ప్రెస్ క్లబ్ భవనంలో శనివారం జర్నలిస్టులకు అయ్యప్ప ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత ప్రమాద భీమా పత్రాల పంపిణీ కార్యక్రమం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సుంకరి గంగా మోహన్ అధ్యక్షతన అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన న్యాయమూర్తి సరళరాణి జర్నలిస్టులకు భీమా పత్రాలను అందజేసి మాట్లాడారు. ప్రజల పక్షాన నిరంతరం ప్రాణాలకు తెగించి పనిచేసే జర్నలిస్టులకు అయ్యప్ప ఫౌండేషన్ చైర్మన్ అయ్యప్ప శ్రీనివాస్ ఉచిత ప్రమాద భీమా చేయించడం ఎంతో అభినందనీయమన్నారు. వార్తా సేకరణ కోసం నిత్యం ప్రయాణాలు చేసే జర్నలిస్టులకు భీమా రక్షణ ఎంతో అవసరమన్నారు. జర్నలిస్టులు ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, రోడ్డు భద్రతా నియమాలు పాటించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు.

**సమాజంలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకం: ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి**

అనంతరం ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, సమాజ రక్షణలో, శాంతిభద్రతల పరిరక్షణలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమన్నారు. ఇరవై నాలుగు గంటలు విధి నిర్వహణలో ఉండే జర్నలిస్టులు సమాజంలోని చెడును, అక్రమాలను వెలికితీసి నేరాల నివారణకు పోలీసు శాఖకు సహకరించాలన్నారు. అయ్యప్ప ఫౌండేషన్ చైర్మన్, మున్సిపల్ మాజీ చైర్మన్ అయ్యప్ప శ్రీనివాస్ మాట్లాడుతూ, ఫౌండేషన్ ద్వారా పేదలకు చేతనైనంత సహాయం అందిస్తున్నామని, జర్నలిస్టులు అడగగానే సామాజిక బాధ్యతగా ఈ భీమా చేయించినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో నవనాథపురం ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు సాత్ పుతే శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు షికారి శ్రీనివాస్, కార్యదర్శి మ్యాకల దినేష్, కోశాధికారి తొగర్ల రాజేందర్, సంయుక్త కార్యదర్శి అర్గుల్ అజీమ్, సలహాదారులు మంచిర్యాల నరేందర్, బారడ్ గణేష్, సభ్యులు గోజూరు మహిపాల్, తమ్మె వినోద్, చేపూర్ గణేష్, జర్నలిస్టులు విన్సెంట్, శ్రావణ్, మోహన్ రెడ్డి, మోహన్ బాబు పాల్గొన్నారు.

# టీచర్ల నిర్లక్ష్యంతో అటెండర్ తో పాఠాలు చెప్పించడం దారుణ్యం

## - కుబీర్ మండలం అంతర్ని బడి దుస్థితిపై విచారణ జరిపాలని శీతల్కర్ అరవింద్ డిమాండ్



నిర్మల్, జూలై 11 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ జిల్లా కుబీర్ మండలంలోని అంతర్ని ప్రభుత్వ పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఒకేసారి సెలవు పెట్టడంతో విద్యార్థులకు అటెండర్ తరగతి గదిలో కూర్చుని పాఠాలు బోధించిన ఘటనపై ఛాత్ర యువ సంఘర్ష సమితి (సీవైఎస్ఎస్) నిర్మల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శీతల్కర్ అరవింద్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం ఆయన జిల్లా కేంద్రంలో మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించాల్సిన సమయంలో ఇలాంటి బాధ్యతారాహిత్య ఘటనలు చోటుచేసుకోవడం విద్యాశాఖ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఉపాధ్యాయులు సెలవులో ఉంటే ప్రత్యామ్నాయంగా వెంటనే ఇతర టీచర్లను ఏర్పాటు చేయాల్సిన కనీస బాధ్యత మండల విద్యాశాఖపై ఉందన్నారు. కుబీర్ మండలంలో ఉపాధ్యాయులు పాఠశాలకు రాకుండా, కేవలం ఆన్‌లైన్ హాజరు యాప్ లో అటెండెన్స్ వేసి సొంత పనుల కోసం తిరుగుతున్నా విద్యాధికారి పట్టించుకోకపోవడం దారుణమన్నారు. బడికి పోని బడిపంతుళ్ల వ్యవహారం గత దశాబ్ద కాలంగా కుబీర్ లో యథేచ్ఛగా సాగుతోందని మండిపడ్డారు. తక్షణమే స్పందించి బాధ్యులైన అధికారులపై, ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిచో విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## సోన్, లక్ష్మణచందా మండలాల్లో కలెక్టర్ భవేశ్ మిశ్రా క్షేత్రస్థాయి ఎస్ఐఆర్ తనిఖీలు

# బూత్ లెవెల్ అధికారులు తప్పనిసరిగా ఇంటింటికీ వెళ్లి దరఖాస్తులు సేకరించాలి



నిర్మల్, జూలై 11 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్.ఐ.ఆర్) ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన జిల్లాలోని సోన్, లక్ష్మణచందా మండలాల్లో విస్తృతంగా పర్యటించి, జరుగుతున్న ఓటరు నమోదు ప్రక్రియను క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. క్షేత్రస్థాయిలో బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓ) తప్పనిసరిగా ప్రతి ఇంటికీ వెళ్లి ఓటరు జాబితా సవరణకు సంబంధించిన ఫారమ్‌లను సేకరించాలన్నారు. ఓటర్లు ఫారమ్‌లు నింపే సమయంలో అధికారుల సాంకేతిక సహకారం అందించాలన్నారు. రోజువారీగా నిర్దేశించుకున్న లక్ష్యాలను నిర్ణీత సమయంలోపు పూర్తి చేయాలన్నారు. అనంతరం లక్ష్మణచందా మండలం పార్‌పల్లి గ్రామంలో ఎస్.ఐ.ఆర్. కార్యక్రమాన్ని కలెక్టర్ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గ్రామంలో మొత్తం ఓటర్ల సంఖ్య, పంపిణీ చేసిన ఫారమ్‌లు, ఇప్పటి వరకు స్వీకరించిన దరఖాస్తులు, పూర్తి చేసిన డిజిటలైజేషన్ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. తప్పులు లేని జాబితా రూపకల్పనకు సూపర్‌వైజర్లు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పర్యటనలో తహసిల్దార్లు సంతోష్, సరిత పాల్గొన్నారు.

# బాసర ఆర్జీయూకేటీ విద్యార్థిని చవాన్ తపస్వికి ప్రతిష్టాత్మక 'ఎల్ఐసీ గోల్డెన్ జూబ్లీ స్కాలర్‌షిప్'




బాసర, జూలై 11 (తెలంగాణ వెన్నెల వాక్కు - ప్రత్యేక ప్రతినిధి):
నిర్మల్ జిల్లా బాసర రాజీవ్‌గాంధీ విజ్ఞాన సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ - ట్రిపుల్ ఐటీ) కీర్తి కిరీటంలో మరో అంతర్జాతీయ స్థాయి ప్రతిష్టాత్మక గౌరవం దక్కింది. బాసర ట్రిపుల్ ఐటీ క్యాంపస్ లో పీయూసీ ప్రథమ సంవత్సరం చదువుతున్న చవాన్ తపస్వి అనే విద్యార్థిని జాతీయ స్థాయిలో అత్యంత ప్రతిష్టాత్మకమైన 'ఎల్ఐసీ గోల్డెన్ జూబ్లీ స్కాలర్‌షిప్ 2025-26' కు అధికారికంగా ఎంపికయ్యారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన అత్యంత ప్రతిభావంతులైన విద్యార్థులను ఉన్నత చదువుల కొరకు ప్రోత్సహించేందుకు లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) దేశవ్యాప్తంగా ఈ స్కాలర్‌షిప్‌ను అందిస్తుంది. ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రాథమిక పరిశీలన, కఠినమైన వడపోత అనంతరం తపస్వి ఈ స్కాలర్‌షిప్ తుది ఎంపిక కొరకు జాతీయ స్థాయిలో షార్ట్‌లిస్ట్ అయ్యారు.

**క్యాంపస్ లో వెల్లువెత్తిన హర్షాతిరేకాలు:**

విద్యార్థిని చవాన్ తపస్వి సాధించిన ఈ చారిత్రాత్మక ప్రతిభను పురస్కరించుకుని శనివారం విశ్వవిద్యాలయ ఇన్‌చార్జ్ వైస్ ఛాన్సలర్ గోవర్ధన్, అసోసియేట్ డీన్ డాక్టర్ ఎస్. విటల్ లు విద్యార్థినిని క్యాంపస్ లో ప్రత్యేకంగా పిలిచి శాలువాతో సత్కరించి అభినందించారు. తపస్వి భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు చేరుకుని, విశ్వవిద్యాలయానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంత పేద నేపథ్యం నుండి వచ్చి జాతీయ స్థాయి స్కాలర్‌షిప్‌కు ఎంపిక కావడం పట్ల యూనివర్సిటీ అధికారులు, అధ్యాపకులు, తోటి విద్యార్థులు తీవ్ర హర్షం వ్యక్తం చేస్తూ ఆమెకు సామాజిక మాధ్యమాల్లో శుభాకాంక్షలు తెలియజేశారు.

# భూముల సర్వే, రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

## - ఖమ్మం కలెక్టరేట్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర మంత్రి వీడియో కాన్ఫరెన్స్

నిర్మల్, జూలై 11 (తెలంగాణ వెన్నెల వాక్కు):
రాష్ట్రంలో భూములకు సంబంధించిన అధికారిక సర్వే, రీసర్వే ప్రక్రియను అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శనివారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం నుంచి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూముల సర్వే, రీసర్వే అంశాలపై రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో ఉన్నత స్థాయి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రెవెన్యూ మ్యాపులు లేని గ్రామాలకు పక్కాగా మ్యాపులు తయారు చేసేందుకు ఈ సర్వేను ప్రతిష్టాత్మకంగా చేపట్టినట్లు వివరించారు. ప్రతి జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసిన 70 గ్రామాల్లో అత్యాధునిక సాంకేతికత, డ్రోన్లను వినియోగించి రీసర్వే నిర్వహిస్తున్నామని చెప్పారు. కలెక్టర్లు స్వయంగా ఈ ప్రక్రియను పర్యవేక్షించాలని, సర్వేలను వేగవంతంగా పూర్తి చేసేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. నిర్మల్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీవో దేవీదాస్, ల్యాండ్ సర్వేయర్ నరసింహ మూర్తి పాల్గొన్నారు.




# బడి సమయం కాకముందే తాళాలు.. ప్రశ్నిస్తే దురుసు సమాధానాలు:



మామడ, జూలై 11 (తెలంగాణ వెన్నెల వాక్కు ):
నిర్మల్ జిల్లా మామడ మండల పరిధిలోని పులిమడుగు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడి బాధ్యతారాహిత్యం, విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరిపై భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఉపాధ్యాయులు విధులకు సక్రమంగా హాజరుకాకుండా, కేవలం ప్రభుత్వ ఎఫ్ఆర్ఎస్ ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్) డిజిటల్ హాజరు నమోదు చేసుకోవడానికే బడికి వస్తూ, అధికారిక సమయం ముగియకముందే పాఠశాలకు తాళాలు వేసి వెళ్తున్న తీరును ఎస్ఎఫ్ఐ తీవ్రంగా ఖండించింది. శనివారం మామడ మండలంలోని పులిమడుగు పాఠశాలను ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ దిగంబర్ ఆధ్వర్యంలో నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా శనివారం నాటి పాఠశాల సమయం కాకముందే గేట్లకు తాళం వేసి ఉండటాన్ని చూసి నాయకులు తీవ్ర విస్మయం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ పాఠశాలను ముందే మూసివేయడం వల్ల పేద విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**అహంకారంతో సమాధానం ఇస్తున్న ప్రధానోపాధ్యాయుడు:**

ఈ విషయమై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు (హెచ్ఎం) స్వామిరెడ్డిని ఎస్ఎఫ్ఐ నాయకులు ఫోన్ లో వివరణ అడగగా, ఆయన ఎంతో బాధ్యతారాహిత్యంగా సమాధానం ఇచ్చారు. "ఎవరు ఏమైనా అడిగితే అంతా ఎంఈఓకే తెలుసు, ఏమున్నా ఆయన్నే అడగండి" అంటూ బదులివ్వడం ఆయన నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. అలాగే ఈ సమస్యపై మండల విద్యాధికారి (ఎంఈఓ) రమణారెడ్డి సదరు ఉపాధ్యాయుడిని ప్రశ్నించగా.. "అంతా మా ఎంఈఓని అడగండి, నాకెందుకు అడుగుతారు? నా ఇష్టం వచ్చినప్పుడు నేను వెళ్తా, నన్ను అడగడానికి మీరు ఎవరు?" అంటూ సదరు ఉపాధ్యాయుడు అధికారులపైనే దురుసుగా బదులివ్వడం ప్రభుత్వ విద్యా వ్యవస్థలోని లోపాలను సూచిస్తోంది. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, విధుల్లో నిర్లక్ష్యం వహించిన హెచ్ఎం స్వామిరెడ్డిపై కఠినమైన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు దిగంబర్ హెచ్చరించారు.

# నిర్మల్ పట్టణంలో ఘనంగా 'తెలంగాణ స్పోర్ట్స్ నాలెడ్జ్ ఆన్ వీల్స్' ప్రారంభం




.నిర్మల్, జూలై 11 (తెలంగాణ వెన్నెల వాక్కు):
తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) ఆదేశాలు, జిల్లా కలెక్టర్ సూచనల మేరకు జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్మల్ పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో 'తెలంగాణ స్పోర్ట్స్ నాలెడ్జ్ ఆన్ వీల్స్' వినూత్న కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ క్రీడా శిక్షణా కార్యక్రమంలో జిల్లాకు చెందిన యువ క్రీడాకారులు, పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు (పీడీలు), కోచ్‌లకు అత్యాధునిక శిక్షణా విధానాలు, ఫిజికల్ ఫిట్‌నెస్, స్పోర్ట్స్ సైన్స్, పోషకాహార నియమాలు, ఆటల సమయంలో జరిగే గాయాల నివారణోపాయాలపై క్రీడా నిపుణులు విస్తృత అవగాహన కల్పించారు. క్రీడలలో గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను మెరుగుపరిచేందుకు ఇటువంటి అవగాహన సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తోందని అధికారులు వివరించారు. కార్యక్రమంలో తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఉప సంచాలకులు సుజాత, జిల్లా యువజన, క్రీడల అధికారి బి. శ్రీకాంత్ రెడ్డి, స్పోర్ట్స్ యూనివర్సిటీ జిల్లా నోడల్ అధికారి శ్రీనివాస్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి రవీందర్ గౌడ్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

OWNED AND EDITED BY VENKAGARI BHUMIAIAH, H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILWALPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, PUBLISHED BY YOGESH KUMAR D, H. NO. 3-167, DILAWARPUR VILLAGE & MANDAL, NIRMAL, TELANGANA-504306, PRINTER MOHAMMAD ABDUL RAHEMAN PRINTED AT MMI PRINTING PRESS 1-227/A, HIGHWAY ROAD, KONDAPALLE REBBANA, KONARAM BHEEM, ASIFABAD, MANCHERIAL, TELANGANA-504292, PUBLISHED AT H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILAWARPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, EDITOR: BDT VENKAGARI BHUMIAIAH, PRGI REGISTRATION NUMBER TG-TEL/25/A0871, CELL: 9848568953, MAIL ID: telanganavennelawakku@gmail.com